www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023
5

వైవీయూలో ఆచార్యులుగా ముగ్గురికి ఉద్యోగోన్నతి

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో సహ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ జి.శాత్యాయని (మ్యాథ్స్), డాక్టర్ డి.విజయలక్ష్మి (మైక్రోబయాలజీ) డాక్టర్ ఎం.ఎం.వినోదిని (తెలుగు) కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ద్వారా ఆచార్యులుగా ఉద్యోగోన్నతి లభించింది. కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న డాక్టర్ కె.శ్రీనివాసరావు సహ ఆచార్యులుగా పదోన్నతి పొందారు. ఈ నలుగురికి విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వెంకటసుబ్బయ్య నియామకపు పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మీ బాధ్యత మరింత పెరిగిందని, విద్యార్థుల, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య డి.విజయ రాఘవ ప్రసాద్, ఐ క్యు ఎసి డైరెక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ, ఆచార్య ఎస్.ని గంగిరెడ్డి పాల్గొని ఉద్యోగోన్నతులు పొందిన వారిని అభినందించారు.

రీజినల్ డైరెక్టర్ కావలెను!

సిఎం జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఇష్టారాజ్యం
ఇ-పోస్టింగ్స్ పేరుతో బదిలీలు, ఉద్యోగోన్నతులు
30 రోజులుగా ఆర్‌డి విధులకు గైర్హాజర్

రీజినల్ డైరెక్టర్ కార్యాలయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 రీజినల్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారి నియామకం కొరవడింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న వైఎస్ఆర్ కడప జిల్లాలోని రీజినల్ డైరెక్టర్ పోస్టుకు రెగ్యులర్ అధికారి నియామకానికి నోచుకోవడం లేదు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలోని నాలుగు జోన్లలో జోన్-1, జోన్-2, జోన్-3 రీజినల్ డైరెక్టర్లు బదిలీలు, పదోన్నతులు, కౌన్సెలింగ్ వంటి పాలనాపరమైన అంశాల్లో సమర్థ వంతంగా విధులు నిర్వహిస్తున్నారు. కానీ జోన్-4 రీజియన్‌కు రెగ్యులర్ అధికారి కొరవడిన నేపథ్యంలో గతేడాది నవంబర్‌లో నిర్వహించిన స్టాఫ్‌నర్సుల పోస్టింగ్స్ మొదలుకుని ఎంపిహెచ్ఎస్, ఎంపిహెచ్ఒ పోస్టింగ్స్, ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీలు, పదోన్నతులు, తాజాగా మరో 313 స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్ వరకు వివాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో గత మే మాసం నాలుగో వారం నుంచి నేటి వరకు జోన్-4 రీజియన్‌లో రెగ్యులర్ స్థాయి రీజినల్ డైరెక్టర్ లేకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్ర రాజధాని విజయవాడ నుంచి అనిల్‌కుమార్ అనే డైరెక్టర్‌ను అదనపు అధికారిగా నియమించారు. ఆయన జులై మొదటి వారంలో బాధ్యతలు తీసుకున్నారు. జులై 19, 20, 21 తేదీల్లో జోన్-4 పరిధిలోని సుమారు మూడు నుంచి ఐదు వేల మంది అధికారుల బదిలీల సమయంలో విధులకు హాజరయ్యారు. అప్పటి నుంచి నేటి వరకు జిల్లా వైపు తొంగిచూడడం లేదనే విమర్శల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది మే నెల చివరి వారం వరకు రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్‌గా డాక్టర్ కోటేశ్వరి విధులు నిర్వహిస్తుండేవారు. ఆమె పదోన్నతిపై విజయవాడకు వెళ్లినప్పటి నుంచి రెగ్యులర్ అధికారి నియామకానికి నోచుకోవడం లేదు. ఫలితంగా ఆర్‌డి కార్యాలయ అధికారులు ఈ-పోస్టింగ్ పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికి ముగ్గురికి బదిలీలు, నలుగురికి పదోన్నతులకు అవకాశం కల్పించారనే గుసగుసలు వినిపిస్తుండడం గమనార్హం. రీజినల్ డైరెక్టర్ పూర్తి స్థాయిలో సంబంధిత ఫైళ్లను పరిశీలించకుండా బదిలీలు చేయడ మేమిటనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా 313 స్టాఫ్‌నర్సుల పోస్టుల కౌన్సెలింగ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వ హించాల్సి ఉంది. ఈమేరకు ఆర్‌డి కార్యాలయ అధికారులు డిఎంహెచ్ఒ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఏర్పాట్లు చేశారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్‌లో క్షుణ్ణంగా సర్టి ఫికెట్లను పరిశీలనలో దొర్లిన పొరపాట్ల కారణంగా బోగస్ సర్టిఫికెట్ల వివాదం తలెత్తింది. అప్పట్లో సంబంధిత అధికారిని సస్పెండ్ చేయడం, కేసు నమోదు వంటి ఘటనలు చోటుచేసుకున్న సంఘటన తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్ అధికారిని నియమించని పక్షంలో బదిలీలు దగ్గర నుంచి పదోన్నతులు, కౌన్సెలింగ్ వంటి అంశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందనడంలో సందేహం లేదు. సంబంధిత రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు రెగ్యులర్ రీజినల్ డైరెక్టర్‌ను నియమించాలనే వాదన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నుంచి వినిపిస్తోంది. దీనిపై సంబంధిత సూపరింటెండెంట్ స్థాయి అధి కారిని ఆరా తీయగా 10 రోజులకు ఒకసారి విజయవాడకు ఫైళ్లను తీసుకెళ్తున్నామని పేర్కొనడం గమనార్హం.

ఉపశమనం!

ఖరీఫ్ సాగుకు ఊతం
వరి, పత్తి, వేరుశనగ సాగుకు సానుకూలం

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్వల్ప ఉపశమనాన్ని కలిగించింది. ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు మోస్తరు వర్షపాతం నమోదుకాని సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా ఉంటుందనే వాతావరణశాఖ హెచ్చరికల ప్రభావం ఫలించింది. జిల్లాలో మూడ్రోజులుగా మేఘం ఉరుముతోంది. కానీ ఆశించిన వర్షపాతం నమోదు కాలేదు. తాజాగా ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడం స్వల్ప ఉపశమనాన్ని కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు ఊపందుకోనుంది. సుమారు 4.53 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడింది. 12 డివిజన్ల పరిధిలో ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, పత్తి, మినుములు, సోయాబీన్ తదితర పంటలను పెద్దఎత్తున సాగు ఊపందుకోనుంది.

చెన్నూరులో అత్యధికంగా 38.8 మి.మీ

జిల్లాలో సోమవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం ఎనిమిది గంటల వరకు మోస్తరు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా చక్రాయపేటలో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. లింగాల మండలంలో వానజాడ కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ధాటికి కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీటి నిల్వలు నిండుకున్నాయి. జిల్లాలో నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే చెన్నూరులో అత్యధికంగా 38.8 మి.మీ, సిద్ధవటం 30.2, కడప 28.2 మి.మీ, ఒంటిమిట్ట 25.4 శాతం, ఖాజీపేటలో 24.8 మి.మీ, పెండ్లిమర్రిలో 4.2 మి.మీ మేర వర్షపాతం నమోదు కావడం గమనార్హం. బుధవారం రాత్రి నుంచి మోస్తరు వర్షపాతం కొనసాగుతుండడం రైతాంగంలో ఆశలు రేపుతోంది.

వరి, పత్తి సాగుకు ఊతం

జిల్లాలో వరి, వేరుశనగ, పత్తి, మినుములు, సోయాబీన్ ప్రధాన ఆహారపు పంటలు. 2023-24 ఖరీఫ్ సీజన్ సాగు విస్తీర్ణంలో అత్యధిక వాటా వీటిదే. ఇం దులో వరి 83 వేల ఎకరాలు, 53 వేల ఎకరాల్లో పత్తి, మినుము, వేరుశనగ పంటలు గణనీయంగా సాగవుతోంది. వీటితోపాటు వరి, వేరుశనగ, పత్తి, సోయాబీన్ పంటలు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. ప్రతి ఏటా జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారం భం కావడం తెలిసిందే. జూన్ మాసంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ సాగు ఒడిదుడుకుల మధ్య సాగుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జులై మాసంలో నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి ఖరీఫ్ సీజన్ సాగు నిర్దేశింపబడుతుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జులై నాలుగవ వారంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో ఆశలను రేపుతోంది. జులై మొదటి వారం నుంచి ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడంతో పంటల సాగుకు సానుకూల వాతావరణం ఏర్పడింది.

'ఉక్కు'పై కేంద్రం మరో మారు మోసం : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా అభివృద్ధికి ఆక్సిజన్ లాంటి కడప ఉక్కు పరిశ్రమకు మోడీ మొండిచేయి చూపించడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్ అథారిటీ ఆధ్వర్యంలో కడప జిల్లాలోని ఐరన్ ఓర్లుపై పరిశోధనలు చేశారని తెలిపారు. జిల్లాలోని పెండ్లిమర్రి మండలంలో ఫస్ట్ క్వాలిటీ ఐరన్ ఓర్లు 150 సంవత్సరాలకు కావలసినంత ముడిసరుకు ఉందని నివేదిక కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. విభజన చట్టంలో ఆమోదించబడ్డ ఉక్కు పరిశ్రమ హామీకి మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. 2018 డిసెంబర్‌లో నాటి సిఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మైలవరం మండలం కంబాలదిన్నె వద్ద ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేశారన్నారు. 2019 డిసెంబర్‌లో జగన్మో హన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కన్యతీర్థం వద్ద శంకుస్థాపన చేశారన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు నాలుగు దఫాలు శంకుస్థాపనలు చేసిన ఒక్క అడుగు కూడా ముందుకు పోలేదన్నారు. సిఎం మరో మారు 2023, ఫిబ్రవరిలో రెండవసారి అదే చోట మళ్లీ శంకుస్థాపన చేసి 30 నెలల్లో రూ.8,800 కోట్లతో కడప ఉక్కు పరిశ్రమ మొదటి దశ పూర్తవుతుందని చెప్పి నేటికీ ఆరు నెలలు గడిచిపోయిందని కనీసం ప్లాంటుకు కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ కూడా కట్టలేదన్నారు. జిల్లాలో బిజెపి యేతర కలిసి వచ్చే పార్టీలతో, ప్రజాసంఘాలతో, మేధావులతో భవిష్య త్తులో ఉద్యమ చేపడతామని తెలిపారు. సమా వేశంలో జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, ఎ.రామ్మోహన్, బి.మనోహర్ పాల్గొన్నారు.

యువతను మోసగించిన కేంద్రం

కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని విద్యార్థులు, యువకులు పోరాటాలకు నాంది పలకాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సంజీవినైన ఉక్కు సాధ్యం కాదని ప్రకటించడం దారుణన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు తాము అధికారంలో వున్నప్పుడు ఇక్కడ మూడు శిలాఫలకంలు ఏర్పాటు చేసి కేంద్రాన్ని ఎదురించకుండా ఉక్కును రాజకీయ ఓటు బ్యాంకు రూపంలో వాడుకుంటున్నారన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, ఉపాధ్యక్షులు విజయ్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట : మంత్రి సురేష్

మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-కడప

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయానికి ప్రాధాన్యతమిస్తూ రైతేరాజు ఒక పండగలా ఉండాలని ప్రతి బడుగు బలహీన దళిత రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్‌సి సేవా సహకార సంఘం, కడప వారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన (పిఎంఎజెఎవై) పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయం చేయుచున్న ఎస్‌సి రైతులకు విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో రైతాంగానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాలు, స్టోరేజీలు, శీతలీకరణ స్టోరేజీలు రైతులకు ఏర్పాటు చేశామని తెలిపారు. చుక్కల భూములను తొలగిస్తూ పేదలకు యాజమాన్య హక్కుతో పంపిణీ చేశామన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. పిఎండిఎస్ కిట్టు కింద జీలగలు, పిల్లి పెసర, జనుములు, రాగి, కొర్ర, సజ్జలు, మినుములు, పెసలు, కందులు, సీడ్ టు సీడ్ కిట్టు కింద కందులు మొక్కజొన్న, జొన్నలు, సజ్జలు, కందులు, పెసలు మరియు కిచెన్ గార్డెన్ కిడ్స్ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఒక్కొక్క ఎస్సీ రైతుకు రూ.7630 విలువ కలిగిన ఇతర అవసరమైన వ్యవసాయ ఉపకరణములు, పేరామిన్ ట్రాప్స్, లూర్స్, ఎల్లో స్టికి ప్లేట్స్, టార్పా లిన్స్, డ్రమ్ములు మొదలగునవి తదుపరి పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం మంత్రి సురేష్ చేతుల మీదుగా విత్తన కీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీనివాసులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.శివ ప్రసాద్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ వెంకట సుబ్బయ్య, డిపిఎం పి.రామకృష్ణరాజు, అదనపు డిపిఎం వసంత కుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప

ఈ నెల 27వ తేదీ నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు కడపలోని ఎసిఎ స్టేడియం/కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ఎసిఎ అండర్-19 మల్టీ డే ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.రెడ్డి ప్రసాద్ తెలిపారు. ప్రారంభ మ్యాచ్ ఈ నెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు నార్త్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య జరుగుతుందని తెలిపారు. రెండవ మ్యాచ్ ఈనెల 31వ తేదీ నుండి ఆగస్టు 2వ తేదీ వరకు సెంట్రల్ జోన్, నార్త్ జోన్ జట్ల మధ్య జరుగుతుందని తెలిపారు. చివరి మ్యాచ్ ఆగస్టు 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు సౌత్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరుగుతుందన్నారు. మ్యాచ్‌లకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

సురేంద్రనాథ్‌రెడ్డిని తక్షణమే తొలగించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

సురేంద్రనాథ్‌రెడ్డిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తక్షణమే తొలగించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు, సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సురేంద్రనాథ్‌రెడ్డి వైవీయు అధికారులను కనుసనల్లో పెట్టుకుని తనకోసమే ప్రత్యేకంగా నోటిఫికేషన్ తెచ్చుకుని ప్రొఫెసర్‌గా నియమించుకున్నాడని తెలిపారు. తన బావ ముఖ్యమంత్రిగాఉన్నాడనే ఒక అహంకారంతోనే యూనివర్సిటీ వ్యవస్థలను చేతుల్లో పెట్టుకుని భారీ అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పిడియస్‌యు అన్నమ్మయ్య జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, నాయకులు ఆజాద్, రాఘవ, సునీల్, సమద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి - కడప

ఉగ్రవాదం ముసుగులో కశ్మీర్‌ను కబళించేందుకు పాక్ చేసిన కుటిల ప్రయత్నాలను ఎదుర్కొని భారత సైన్యం సాధించిన విజయాన్ని కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ భారత ప్రజలందరూ సుఖశాంతులతో ఉన్నారంటే దానికి ప్రధాన కారణం నిద్రలేని రాత్రులు గడుపుతు భారతదేశానికి పహారా కాస్తున్న భారత సైనికులేనన్నారు. భారతీయులందరూ వారి సేవలను గుర్తించుకొని గౌరవించాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై.సావిత్రి మాట్లాడుతూ విద్యార్థులందరూ భారత సైనికుల ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకొని తమ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ సందరక్భంగా 30 ఆంధ్రా బెటాలియన్ పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్ కుమార్, బిస్నోలను శాలువాతో సత్కరించడం జరిగింది. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, అధ్యాపకులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్‌రవి శేఖర్, డాక్టర్ నరసింహారావు, డాక్టర్‌నాగేంద్ర, డాక్టర్ శ్రీనిత మరియు క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షకులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

కడప అర్బన్: జిల్లా వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు ఒకటో తేదీన మున్సిపల్ కార్యాలయాలు ముట్టడించనున్నట్లు తెలిపారు. ఏడవ తేదీ కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని పేర్కొన్నారు. 17న చలో విజయవాడ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోనికి ముందు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కేవలం 7000 మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడం దుర్మార్గమన్నారు. అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఏడు ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు రూ.18,500 వేతనం ఇవ్వాలని చెప్పారు. క్లబ్ డ్రైవర్ల కాంట్రాక్టర్ బండికి రూ.63 వేలు తీసుకుంటున్నాడని తెలిపారు. సాయి పావని, రెడ్డి ఏజెన్సీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కడప, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న కార్మికులతో ఒక్కరోజు కూడా సెలవు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి ఆనందరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

కడప అర్బన్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పార్లమెంట్‌లో ప్రకటించడాన్ని ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నారాయణ సిఆర్‌వి.ప్రసాదరావు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ నిర్మాణం ఎందుకు సాధ్యం కాదో కేంద్ర ప్రభుత్వం చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వం విభజన చట్టంలోని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్యాకేజీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలు తీర్చే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి అవసరమైన అన్ని నిధులు ఇవ్వడానికి నిరాకరించిందన్నారు. విభజన చట్టంలోని ఒక్కటి అమలు చేయక ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీ మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రతిపక్ష పార్టీ అంతా కలిసి వైసిపి టిడిపి కలసి అవిశ్వాస తీర్మానాన్ని బలపరచాలని పేర్కొన్నారు.

కాంక్రీట్ ఏర్పాటుపై హర్షం

కడప: కడప నగరంలోని రాజీవ్ పార్క్ సమీపంలో కాలువ మీద కాంక్రీటు ఏర్పాటు చేయడంపై యూత్ కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షుడు వెన్నపూస మధురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక రాజీవ్ పార్క్ సమీపంలో కాలువపై నాసిరకం బండలు వేశారని ఈ నెల 13న మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కమిషనర్ స్పందించి వెంటనే కాలువపై నాసిరకం బండలు తొలగించి సిమెంట్‌తో నిర్మాణం చేయడం సతోషకరమన్నారు. కార్యక్రమంలో సాదిక్ పాల్గొన్నారు.

డిఇఒ అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలి

కడప అర్బన్: డిఇఒ వై.రాఘవరెడ్డిపై వస్తున్న అవినీతి, అక్రమాల ఆరోపణలపై విచారణ చేపట్టాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనకుండా ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో డిఆర్ఒ గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యలపై పోరాడేందుకు వీలు లేకుండా ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా విద్యార్థులు ర్యాలీలు, ధర్నాలో పాల్గొనకూడదని, అలా పాల్గొంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డిఇఒ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య హక్కులకోసం పోరాటం చేసే హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిందన్నారు. ఉపాధ్యాయులను అసభ్య పదజాలంతో దూషించడం దారుణమన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 31వ తేదీ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు షాకిర్, సురేష్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కడప అర్బన్

మోడీ దుష్పరిపాలన నుంచి రైతులను శ్రామికులను కాపాడాలని ఈ నెల 30న విజయవాడలో సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సు జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు బి.దస్తగిరిరెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పి.శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు గ్యారెంటి చట్టం తేవాలని అన్నదాతలను విస్మరిస్తే ఆహార సంక్షోభం తప్పదని, ఇప్పటికైనా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో వివిధ రైతు సంఘాలు వ్యవసాయ కార్మిక సంఘాలు కార్మిక సంఘాల ప్రతినిధులు, రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా కార్యదర్శి అన్వేష్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్ల భాషకూ ప్రాధాన్యతివ్వాలి

కడప అర్బన్ : మాతృభాషతో పాటు ఆంగ్ల భాషకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఇఒ-2 ఇర్షాద్ అహ్మద్ అన్నారు. బుధవారం ఉర్దూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృ భాషతోపాటు ఆంగ్ల భాషకు ప్రాధాన్యతను ఇచ్చి బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ బోధన ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, విలువలు పెంపొందించే దిశగా బోధించాలన్నారు. సమావేశంలో సముదాయ ఆర్పీలు షకీలా, మహమ్మద్ రఫీ, సిఆర్ఎంటి ఆదిమూలం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

కడప అర్బన్: కార్గిల్ విజయ్ దివస్ 24వ వసంతోత్సవాని పురస్కరించుకుని భారత దేశ సైన్యం ప్రతి సంవత్సరం నిర్వహించే పండుగ సందర్భంగా కడప శాంతినగర్ యుపి స్కూల్‌లో 350 మంది విద్యార్థులకు వైయస్సార్ అన్నమయ్య జిల్లాల మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో విద్యా సామగ్రి, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివస్‌లో ఆపరేషన్ విజయ్ ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో వైయస్సార్, అన్నమయ్య జిల్లాల మాజీ సైనికుల సంఘం అడ్వైజరీ బోర్డు మెంబర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి, స్కూల్ హెచ్ఎం బి.శ్రీనివాసులు, అబ్బిరెడ్డి ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాలబ్రహ్మం, ప్రభాకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న లక్ష్మీనారాయణ

ఐదుగురు కస్తూర్బా సిబ్బందిపై వేటు

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

జిల్లాలోని బ్రహ్మంగారిమఠం కస్తూర్బా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల కస్తూర్బా బాలికల హాస్టల్లో బాలిక అస్వస్థకు గురైన విషయంపై నిర్లక్ష్యంగా వహించిన ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ చేసినట్లు సమాచారం. వీరిలో అటెండర్, ఇద్దరు వంట మనుషులు, నైట్ వాచ్‌మెన్, స్వీపర్ ఉన్నారు. దీనిపై సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డిని సంప్రదించగా సస్పెన్షన్ చేసిన మాట వాస్తవ మేనని పేర్కొనడం గమనార్హం. ఎస్ఎస్ఎ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చదువుల్లో నాణ్యత దగ్గర మొదలుకుని సిబ్బంది ప్రవర్తన వరకు పరిగణలోనికి తీసుకుంటామని గమనంలో ఉంచుకోవాలని పేర్కొనడం గమనార్హం.

కేసులను త్వరగా పరిష్కరించండి

- కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని 'దిశ', ట్రాఫిక్ పోలీసుస్టేషన్లను, కడప డిఎస్‌పి కార్యాలయాన్ని కర్నూలు రేంజ్ డిఐజి ఎస్.సెంథిల్ కుమార్, ఎస్‌పి కెకెఎన్ అన్బురాజన్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ మహిళలపై నేరాలకు సంబంధించి కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖలు మహిళల భద్రతే ప్రాధాన్యతగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కేసులను పరిశీలించి పలు సూచనలు చేశారు. 'దిశ' యాప్ మహిళలందరూ డౌన్ లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రతకు సంబంధించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాధాన్యతను వివరించాలన్నారు. అనంతరం కడప డిఎస్‌పి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కడప సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గంజాయి స్మగ్లింగ్‌పై నిఘా ఉంచి అరికట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 'దిశ' డిఎస్‌పి రమాకాంత్, కడప డిఎస్‌పి ఎండి షరీఫ్, ఆయా పోలీసు స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బిఇడ్ పరీక్ష కేంద్రాల్లో విసి తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ బిఇఒ పరీక్ష కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం నగరంలోని నిర్మల బిఇడి కళాశాల, భారత్ బిఇడి కళాశాల కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను, కళాశాల పరిసరాలను, వసతులను పరిశీలించారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు పరీక్షలు రాసే సందర్భంలో అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల చీఫ్‌సూపరింటిండెంట్లతో మాట్లాడారు.

రోడ్డుపై మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని బిదినంచెర్ల గ్రామ సమీపంలోని వెలిదండ్ల - సింహాద్రిపురం రోడ్డులోని మురుగునీటిని బుధవారం అధికారులు తొలగించారు. నీరు నిలువ ఉండే ప్రాంతాన్ని అధికారులు బాగు చేశారు. ఈనెల 24న 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'వంకను తలపిస్తున్న రోడ్డు' అనే కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే నీరు నిలువ ఉన్న ప్రాంతాన్ని అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టారు. నిలిచిన నీరు పోయేందుకు రోడ్డు పక్కన చిన్న కాలువను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. సమస్య తాత్కాలికంగా పరిష్కారం కావడంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నీటిని తొలగించడంతో కనిపిస్తున్న రోడ్డు

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- ట్రాన్స్‌కో ఎఇఇ రాజబాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మలమడుగు ట్రాన్స్‌కో ఎఇఇ రాజబాబు సూచించారు. బుధవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తడిసిన విద్యుత్ స్తంభాలను, లైన్లు తగిని ఉన్న చెట్లను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే ఆ విషయాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు తెలియజేయాలన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోకూడదన్నారు. బయట పెట్టిన లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై వెయ్యరాదన్నారు. గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని తెలిపారు. వాటర్ హీటర్ స్విచ్ ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తర్వాతనే నీళ్లు పెట్టిన వస్తువును తాకాలని సూచించారు. ఉరుములు మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసివేయాలన్నారు. వర్షం పడుతున్న సమయంలో టివి, ఫ్రిజ్, కంప్యూటర్ స్విచ్‌లను ఆఫ్ చేయాలన్నారు. విద్యుత్ లైన్ క్రింద సెల్‌ఫోన్ మాట్లాడకూడదన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైనా డ్యామేజ్ అయితే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.



జగనన్న సురక్ష ప్రజలకు ఎంతో మేలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్‌రెడ్డి. సర్పంచ్ మహేశ్వర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అంజేస్తున్న అధికారులు

నేడు పెద్దగురువలూరులో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని పెద్దగురువలూరు గ్రామంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణవేణి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పాల్గొంటారన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక పాల్గొనాలని ఆమె కోరారు. ఏవైనా సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు.

పూలహారాలు, చదివింపులు అందజేత

ప్రజాశక్తి - ముద్దనూరు

మొహర్రం పండుగ సందర్భంగా స్థానిక పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లను బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్ పర్సన్ ఉమాదేవి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్వామికి పూలహారం, చదివింపులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ ఖాదర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీర్లను సందర్శించిన నేతలు

కిలో రూ.48కే జిలకర మసూర బియ్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మార్కెట్లో బియ్యం ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా మిల్లర్ల ద్వారా, మండి మర్చంట్ అసోసియేషన్ ద్వారా కిలో బియ్యాన్ని రూ.48కే అందించేలా ఏర్పాటు చేశారని పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి గోవింద్ మోరే తెలిపారు. పులివెందుల పట్టణంలో గర్ల్స్ కాలేజీ, సాయినగర్, సుజాత హాల్ దగ్గర కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిని గురువారం ఉదయం ఆర్డిఒ వెంకటేశులు, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిలకర మసూర బియ్యాన్ని ఆయా కౌంటర్ల ద్వారా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డుకు 10కిలోలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాలో, పులివెందులలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ధృవకుమార్‌రెడ్డి కోరారు. బుధవారం విజయవాడలో పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి, జంగా గౌతమ్‌ను ధృవకుమార్‌రెడ్డి, కాంగ్రెసు నాయకులు వేమయ్య కలిశారు. కడప, పులివెందుల సమస్యలను వినతిపత్రంలో అందజేశారు. ఆ సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. సమస్యలపై విడతలవారీగా పోరాటం చేస్తామని గిడుగు రుద్రరాజు హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు.

క్రైం కార్నర్

బైక్, రూ.1,20 లక్షల నగదు చోరీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరు గ్రామంలో బైక్‌తోపాటు అందులోని రూ.1,20 లక్షల నగదును మంగళవారం సాయంకాలం గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిర్రాజుపల్లెకు చెందిన గంగిరెడ్డిగారి జగదీశ్వర్‌రెడ్డి అనే రైతు తన పంట రుణం తీర్చేందుకు చిలమకూరులోని సిండికేట్ బ్యాంకు వద్దకు తన బైక్‌లో వెళ్లారు. సిండికేట్ బ్యాంకు వద్ద బైక్ ఆపి కొద్దిసేపటికి తిరిగి వచ్చేసరికి అక్కడ బైక్ కనిపించలేదు. చుట్టుపక్క ప్రాంతాలు ఫలితంలేదు. అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాల సాయంతో వెతికిన ఆచూకీ దొరకలేదు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అధ్వానంగా మారిన రోడ్లు

గుంతలు, బురదమయం - నడవలేని విద్యార్థులు, స్థానికులు

గుంతలు, బురదతో నడవడానికి వీల్లేకుండా ఉన్న రోడ్డు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డులోని ఎపిజిబి వద్ద నుండి వలసపల్లి వెళ్లే రస్తా (పాత రస్తా) చిన్నపాటి వర్షాలకే పూర్తిగా బురదమయం అవుతోంది. ముందుగానే ఆ దారి గుంతలమయం. ఇటు గుంతలు, అటు వర్షపునీరు నిలిచి, ఆ దారిన వెళ్లాలంటే విద్యార్థులు, స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రస్తా పట్టణంలోని 13,14,15,16 కౌన్సిల్ వార్డులలోని పలు వీధులను కలుపుతూ నాలుగు రోడ్ల కూడలికి ఆ ప్రాంతవాసులు త్వరగా చేరుకునేందుకు వీలుగా ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రస్తా కావడంతో పూర్తిగా గుంతలు పడ్డాయి. స్థానికులు స్పందించి ఆ గుంతలను మట్టిని వేసి పూడ్చారు. చిన్నపాటి వర్షాలకే రోడ్డు మొత్తం చిత్తడిగా తయారవుతోంది. కొత్త రోడ్డు నిర్మించాలంటూ నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసిన ఫలితం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా రెండు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఆ రోడ్డున నడవలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాకపోకల సమయంలో బురద నీరు విద్యార్థులు, పని నిమిత్తం బయటకు వెళ్లే పాదచారులపై పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఎలా వెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్వి చక్రవాహనదారులు జారిపడిన సందర్భాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ రస్తాలో కొద్ది దూరం మాత్రం మురుగు కాలువలు నూతన రోడ్డు నిర్మించారు. మిగిలిన రోడ్డును వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నిలిచిన ఈ బురద నీటిలో క్రిమి కీటకాలు, దోమలు ఆవాసాలను ఏర్పరుచుకోవడంతో, వాటి బెడద ఎక్కువైందని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి ఏ ఒక్కరూ ముందుకు రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికే వీధులు జలమయం

వేంపల్లె : మురుగు కాలువలు సరిగాలేక చిన్నపాటి వర్షానికే వీధులు జలమయమవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. బుధవారం వేంపల్లెలో కొద్దిపాటి వర్షం కురిసింది. స్థానిక గండి రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ గెస్ట్‌హౌస్ వెనుక వీధి, ఇమామ్ నగర్ వీధులు నీటితో నిండి పోయాయి. కొన్నేళ్లుగా సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లుతున్నా ఫలితంలేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి వస్తోందని, విషపురుగులు కూడా వస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వాగును తలపిస్తున్న వీధి

అరటి సాగులో ఖర్చులు తగ్గించుకోవాలి

రైతులకు అవగాహన కల్పిస్తున్న జయభాస్కరన్

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

మట్టి నమూనా పరీక్షల ఫలితంగా అరటిసాగు చేపట్టాలని, ఆ ప్రకారం సాగు ఖర్చులు తగ్గించుకోవాలని జాతీయ అరటి పరిశోధన సంస్థ తిరుచునాపల్లి ప్రధాన శాస్త్రవేత్త జయభాస్కరన్ సూచించారు. మండలంలోని నల్లపురెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం జాతీయ అరటి పరిశోధన సంస్థ, ఉద్యానశాఖ ఎడి సుభాషిణి, అరటి పరిశోధన సంస్థ పులివెందుల ప్రధాన శాస్త్రవేత్త సుశీల, వేంపల్లి ఉద్యాన అధికారి రెడ్డయ్య, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి సంయక్త ఆధ్వర్యంలో అరటి సాగు రైతు సోదరులకు గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్(జిఎపి) సర్టిఫికేషన్ మీద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జయ భాస్కరన్ మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షల ఫలితాల ఆధారంగా అరటిలో ఎరువులు, సూక్ష్మ పోషకాలను వినియోగించాలన్నారు. భూమిలో ఉండే పోషకాల ఆధారంగా ఎరువులు వేసుకుంటూ ఖర్చులను తప్పించుకోవచ్చు అన్నారు. ఎడి సుభాషిణి మాట్లాడుతూ గ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా అరటి పంటను ఎగుమతి చేసి అధిక ఆదాయాన్ని ఆర్జించవచ్చునని తెలిపారు. గ్యాప్ సర్టిఫికేషన్ కోసం పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు. పులివెందుల ప్రధాన శాస్త్రవేత్త సుశీల మాట్లాడుతూ అరటిలో సిగతోక ఆకుమచ్చ తెగులు నివారణ చర్యలను క్లుప్తంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి గ్రామపంచాయతీ రైతులు, ఆర్‌బికె, ఉద్యాన, వ్యవసాయ అసిస్టెంట్లు రాఘవేంద్ర, హరి, కీర్తన పాల్గొన్నారు.

ఉక్కుపై కేంద్రానిది మోసపూరిత వైఖరి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కడప ఉక్కుపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మరోసారి మోస పూరిత వైఖరితో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివనారాయణ విమర్శించారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర సహాయ మంత్రి కడప ఉక్కు ఏర్పాటు సాధ్యం కాదని స్పష్టంగా చెప్పడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దీనిపై రాష్ట్రంలోని వైసిపి, ఇతర పార్టీల వైఖరి స్పష్టం చేయాలన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా చెప్పిన మేరకు కడప ఉక్కు పరిశ్రమను బిజెపి అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన ఏర్పాటు చేస్తామని, ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత సాధ్యం కాదనడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. ఇక్కడ ఓట్లు, సీట్లు రావన్న కారణంతోనే రాష్ట్ర హక్కులను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోందన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇక్కడ మూడు శిలాఫలకాలు వేశారని, పరిశ్రమ ముందుకు నత్తనడకలా సాగుతోందన్నారు. కేంద్రాన్ని నిలదీయకుండా, లో లోపల మద్దతు ఇస్తూ హక్కులను సాధించడంలో విఫలం చెందారన్నారు. ప్రతిపక్ష పార్టీలు సైతం కడప ఉక్కుపై పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేవలం కడప ఉక్కును ఓటు రాజకీయంగా చూస్తున్నారన్నారు. కడప ఉక్కుపై బిజెపి వైఖరిపై పోరాడాలని, లేకుంటే ప్రజల్లో చరిత్రహీనులుగా నిలిచి పోతారన్నారు. సమావేశంలో నరేంద్ర, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

బిజెపి పాలనలో కడప ఉక్కు బుట్టదాఖలు : పిసిసి

వేంపల్లె : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి పాలనలో కడప ఉక్కు కర్మాగారం బుట్టదాఖలైందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణానికి కావాల్సిన అన్ని హంగులు ఉన్నాయన్నారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి గ్రామపరిధిలో, జమ్మలమడుగు మండలం పరిధిలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన భూమి ఉందన్నారు. జిల్లాలో ఉక్కు కర్మాగారం, విభజన చట్టంలోని అంశాలు అమలు చేయాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేసిందని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని విద్యార్థులు, యువకులు నిరసిస్తూ పోరాటాలకు నాంది పలకాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కడప ఉక్కు ఎపిలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉందన్నారు.

ఎంపీతో చర్చిస్తున్న ఇఒ ముకుందారెడ్డి

కనీస వసతుల కల్పనకు అనుమతి

- ఇఒ అలవలపాటి ముకుందారెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండిక్షేత్రం శ్రావణ మాసం ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించుటకు పెద్ద జర్మన్ షెడ్లు, మొబైల్ టాయిలెట్స్, పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయించడానికి టిటిడి కార్యనిర్వహణ అధికారి అనుమతిచ్చారని ఇఒ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టిటిడి వారికి సిఫారసు చేయవలసిందిగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించామన్నారు. ఇందుకు ఆయన స్పందించి టిటిడి ఇఒతో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. ఆ మేరకు టిటిడి నుంచి అనుమతులు త్వరలో వస్తాయని ముకుందారెడ్డి వివరించారు.

విభిన్న ప్రతిభావంతులకు నిత్యావసరాలు

నిత్యావసర సరుకులు అందిస్తున్న చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం పెద్దకుడాల గ్రామానికి చెందిన నిరుపేద విభిన్నప్రతిభావంత విద్యార్థి సంపంగి రాజేశ్వరికి కళాశాల ఫీజు నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. 30 మంది నిరుపేద విభిన్నప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విభిన్నప్రతిభావంతులు, కౌన్సిలర్లు, నాయకులు వరప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ డేరంగుల ఆంజనేయులు, కౌన్సిలర్లు కాంతమ్మ, కిషోర్, డేనియల్, దాసరి చంద్రమౌళి, వర ప్రసాద్ సోదరుడు వల్లెపు వెంకటరమణ, సిద్దేశ్వర, సంఘం ఆర్. వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరెడ్డి, సునీల్, బషీర్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలో నిందితులను ఉరి తీయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మణిపూర్ ఘటనలో నిందితులను ఉరి తీయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రూరల్ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ఆ ఘటనల పట్ల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణిపుర్‌లో మహిళలను వివస్త్రను చేసి, అత్యాచారం చేసి చంపడం బాధాకరమన్నారు. ఇలా జరగడం బిజెపి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. వెంటనే అక్కడి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలన్నారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలపై బిజెపి పదేపదే దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మతోన్మాదాన్ని విడనాడి ప్రజలను మనుషులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు మహిళా సంఘం కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆట స్థలం అభివృద్ధికి ఎంఇఒ విరాళం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆటస్థలం అభివృద్ధికి ఎంఇఒ బండి వీరారెడ్డి రూ.30 వేలు విరాళం అందజేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆ మేరకు నగదను రాజశేఖర్‌కు బుధవారం ఎంఇఒ అందజేశారు. నాడు-నేడు కింద ఇటీవల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నిర్మాణం చేపట్టడంతో ఆటస్థలం గుంతలమయమైంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆడుకునేందుకు సౌకర్యంగా లేదు. ఈ విషయాన్ని ఎంఇఒ దృష్టికి ఫిజికల్ డైరెక్టర్ తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, సంగమేశ్వరరెడ్డి, శివారెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

ప్రజాశక్తి - కడప అర్బన్

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని బుధవారం శ్రీ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాలు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా ఆధ్వర్యంలో కార్గిల్ విజయోత్సవాన్ని నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సుబేదార్ అశోక్, బిష్ణోయి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుబేదార్ అశోక్ కార్గిల్ యుద్ధంలో జరిగిన సంఘటనలను, తన అనుభవాలను విద్యార్థినులతో పంచుకున్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి మంచి పౌరులుగా ఎదగాలని, సైన్యం పట్ల గురువుల పట్ల సదా గౌరవాన్ని కలిగి ఉండాలని హితవు పలికారు. కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శచీదేవి, ఎన్‌సిసి కో- ఆర్డినేటర్ విన్నీతేజను ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు రవిశంకర్ రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు రమణారెడ్డి పాల్గొన్నారు.

స్టార్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్టార్ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని నాట్యం సినిమా నటి, నృత్యకళాకారిణిగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగ జాతీయ పురస్కారాన్ని అందుకున్న సంధ్యారాజు (రాంకో ఇండస్ట్రీస్ చైర్మెన్) అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం జరుగుతున్న నృత్యప్రదర్శన కార్యక్రమంలో ప్రొద్దుటూరుకు చెందిన స్టార్ ఫౌండేషన్ నిర్వాహకులు కలిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25వేల రక్తదానాలు పూర్తయిన సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు ఫౌండేషన్ సభ్యుడు చలపతి విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో ఫౌండేషన్ ప్రారంభించామన్నారు. మొదటగా రక్తదాన సేవలు ప్రారంభించామన్నారు. అనంతరం నటి సంధ్యారాజు మాట్లాడుతూ స్వచ్ఛంద కార్యక్రమాలకు ఎటువంటి సహకారాన్ని అందించేందుకు తానెల్లప్పుడూ సిద్ధం అని అన్నట్లు చలపతి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మున్వర్ బాషా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. స్థానిక సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ పథకాలు మన సిఎం జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్నారని తెలిపారు. నిరుపేదలకు ఇళ్ల నిర్మాణాలు, విద్యార్థులకు అమ్మఒడి, వైయస్సార్ విద్యా దీవెన, రైతులకు వైయస్సార్ రైతు భరోసా, ఆటో యజమానులకు, నాయీ బ్రాహ్మణులకు, రజకులకు, దర్జీలకు సంవత్సరానికి పదివేల రూపాయలు ప్రకారం జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తమ సమస్యలను ఎంపీకి విన్నవించారు. ఆ సమస్యలన్నీ విన్న ఎంపీ వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అసత్య ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అభివృద్ధిపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అసత్య ప్రచారాలు మానుకోవాలని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టిబి రోడ్డులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రాంతంలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లు చాలా వరకు గ్రౌండ్ లెవెల్‌లో ఉన్నాయని, పురోగతి సాధించలేదన్నారు. అలాంటి వాటికి లేఔట్‌లపై వెయ్యి కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019 ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదలకు ఇళ్లు కట్టించి ఒక చేత్తో తాళాలు, ఇంకో చేత్తో పట్టా ఇస్తానని చెప్పిన ఎమ్మెల్యే.. అలా ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అధికారపార్టీ ఎమ్మెల్యేగా ఉండి రూ.3,378 కోట్లు అభివృద్ధి జరిగిందని రాచమల్లు అసత్యాలు ప్రచారం చేయడం సబబు కాదన్నారు. కార్యకర్తలు అంటే ఎమ్మెల్యేకు విలువ లేదన్నారు. టిడిపి నాయకులను తప్పుగా మాట్లాడటం మానుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జెబివుల్లా, టిడిపి మండల అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి దస్తగిరి, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పాడి రైతులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కాశినాయన

మండల పరిధిలోని గంగనపల్లి గ్రామంలో పాడి రైతులకు సర్పంచ్ చేతుల మీదుగా వైద్యాధికారి రామారావు ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలో లేత పెయ్య దూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. 37 మంది పాడి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి పరిశ్రమ వల్ల ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమానికి ఫార్మా కంపెనీ ప్రతినిధులు టానిక్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు రమణయ్య, రమేష్, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, చెన్నారెడ్డి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం చేస్తున్న సర్పంచ్

కార్యకర్తలను ఆర్థికంగా ఆదుకుంటాం

ప్రజాశక్తి - వేంపల్లె

అనారోగ్య పాలైన టిడిపి కార్యకర్తలకు అండగా ఉండి, వారిని ఆర్థికంగా ఆదుకుంటామని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. బుధవారం మండలంలోని వీరన్నగట్టుపల్లె గ్రామంలో హార్ట్ సర్జరీ చేసుకొని ఉన్న టిడిపి కార్యకర్త బాబా గౌస్ కుమారుడ్ని ఆయన పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్బరాయుడు, భాను కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, మాజీ జిల్లా కార్యదర్శి పివి రమణ, మాజీ వార్డు మెంబరు నల్లగారి కృష్ణారెడ్డి, గొటూరు నాగభూషణం, క్లస్టర్ ఇన్‌ఛార్జి పోతిరెడ్డి శివ, పిపి చెంద్రాయుడు, మండల మైనార్టీ ఉపాధ్యక్షుడు ఇలియాస్, ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, దర్బార్, భాను, అమానుల్లా పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE Addl. SENIOR CIVIL JUDGE, KADAPA.

I.P.No. 38/2023.

Thunga Reddappa Reddy, S/o. Late Babu Reddy Door No.5/230, Ravindra Nagar, Kadapa Town. Cell: 9676706709. **...Petitioner**

Vs

1. E.Paan Kumar S/o. Rama Krishnudu, aged about 30 years, H.Kottala Village, Bethamcherla Mandal, Kurnool District. Cell 9494385638.
2. C.Rupash, S/o. Vasudeva Redy, aged about 33 years, A.P.H.B.Colony, Kadapa Town. Cell 8074007055.
3. Chennur Malla Reddy S/o. Malla Reddy aged about 62 years Door No.2-1-466, Maheshwar Nagar, Kadapa. Cell 9000806656.
4. Bhunu Reddy Sireesha W/o. Praveen Kumar, Aged about 34 years. Residing at 181, 3rd floor. Sri Annpurneswari Nilaya. 1st Mani, Patel Narayanaswamy Layout, Varthur, Bangalore-560066. Cell 6361077974.
5. Sri Sagar, S/o. Krishnaiah, Aged about 35 years, Athmakur, Kurnool District.
6. G. Praveen M/o.Vanajamma, aged about 32 years, Athumakur Kurnool District. Cell: 8639435086.
7. Kumari Jothi, D/o.Gopal aged about 33 years, Athmakur Kurnool District.
8. B.Selvi alias Selvisatr S/o. Devid, door No. 86/170 Sivanandapuram, Kadapa City. Cell 8309334940.
9. S.Goutham, S/o. Not kown, aged about 35 years, Chandha Nagar Hyderabad. Cell 9949892351.
10. Sri Raghu, S/o. Not known aged about 33 years, Singapoor Township Near RIMS, Kadapa City. Cell 7259734999.
11. A.V.Chaintanya, S/o. Chalapathi, aged about 34 years R.T.C. Colony, Kadapa city. Cell: 7899927686.
12. M.Suresh S/o. Not kown, Patha Kadapa, Kadapa City, Cell: 9395193093.
13. K.Mahesh, S/o. Not known door No.1/433-10, Maruthi Nagar Kadapa city.
14. Ari Akash S/o Not kown, S.R.Nagar, Hyderabad, Telanga State.

...Respondents

GENERAL PUBLIC NOTICE

The above named petitioner/Debtor filed the above I.P.No.38/2023 against the respondents to declare him as an insolvent and to discharge him from A schedule liabilities and also for other reliefs. If the respondents or any other persons are having objections appear before the above named Court on 4-8-2023 at about 10-30 AM. either in person or through your authorized counsel. Failing which the matter will be decided as exparte.

K.V.RAMANA REDDY
Advocate,
KADAPA.
Mobile No.98852 02686.